

ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్



ఆత్మీయ సమ్మేళనానికి కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే దానం

# సంక్షేమ ప్రభుత్వాన్ని మరువద్దు

**బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే దానం నాగేందర్**

ఖైరతాబాద్, అక్టోబర్ 16 : పదేండ్లలో రాష్ర్టాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మూడో సారి గెలిపించి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమాజిగూడలోని ఎన్నికల క్యాంపు కార్యాలయం వద్ద కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు వనం సంగీత యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఖైరతాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి తాను నిరంతరం కృషి చేస్తున్నట్లు పాటుపడ్డామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి పథకాలు అమలయ్యాయన్నారు. ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, డబుల్ గృహాలు వంటి పేదలందరికీ అందించామన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టో అమలైతే రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. దళిత, బీసీ, మైనార్టీ బంధు పథకాలు ఎన్నికల తర్వాత లబ్ధిదారులకు అందిస్తామని, మరో 2,700 డబుల్ గృహాలు నియోజకవర్గ ప్రజలకు అందుతాయన్నారు. పనిచేసే కార్యకర్తలకు ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కె. ప్రసన్న రామ్మూర్తి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఎస్‌కేకె అహ్మద్, ప్రధాన కార్యదర్శి పి. నాగరాజు, మాజీ కార్పొరేటర్ లక్ష్మీ నారాయణమ్మ, మహిళా అధ్యక్షురాలు నాగలక్ష్మి, వనం శ్రీనివాస్ యాదవ్, ఉత్తమ్ జగన్, గయాసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకే మనుగడ లేదు

- ప్రజల ఆశీర్వాదంతో ఘన విజయం సాధిస్తా..
- పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే దానం నాగేందర్

హిమాయత్‌నగర్,అక్టోబర్16: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి మనుగడలేదని, ఆ పార్టీ నాయకులు ప్రజలకు ఏమి గ్యారెంటీ ఇస్తారని ఎమ్మెల్యే దానం నాగేందర్ మండిపడ్డారు.ప్రజల ఆశీర్వాదంతో తాను మరోసారి ఎమ్మెల్యేగా ఘన విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.సోమవారం విఠల్‌వాడీలోని రమేష్‌యాదవ్ నివాసంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. స్థానికంగా ఉన్న ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తుందని తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టో సబ్బండ వర్గాల ప్రజల సంక్షేమానికి దిక్సూచిగా నిలుస్తోందన్నారు.వందేళ్లకు పైగా చరిత్ర ఉందని కాంగ్రెస్ పార్టీ వారంటీ ముగిసిందని ఆ పార్టీ ఇచ్చే హామీలకు గ్యారంటీ ఎక్కడుంటుందన్నారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో ముందుకుసాగి ప్రభుత్వం చేసిన పనులు, చేయబోయే పనులను ప్రతి గడపకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు యాదగిరి సుతారి, నాయకులు రూపేష్ యాదవ్, రోహిత్ యాదవ్,రాహుల్ యాదవ్, పి.ప్రభాకర్ గౌడ్,డి.రాజేందర్ కుమార్, సర్ఫరాజ్, రాజేంద్ర ప్రసాద్,యశ్వంత్, సుదర్శన్, మాధవి, మన్సూర్, ఐలమ్మ,కళ, యాస్మీన్, ఖాజా, శ్రీకాంత్, శ్రీనాథ్,చింటు పాల్గొన్నారు.



విఠల్‌వాడీలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం

# విజయానికి ఆత్మ విశ్వాసమే తొలిమెట్టు

హిమాయత్‌నగర్,అక్టోబర్16: ఏ రంగంలోనైనా విజయాన్ని అందిపుచ్చుకోవాలంటే ఆత్మ విశ్వాసం తొలిమెట్టు అని మోటివేషనల్ ప్రతినిధి కక్వష్,ఎంఎంఎస్ సంస్థ వ్యవస్థాపకుడు మడిపడిగె రాజు అన్నారు.సోమవారం హిమాయత్‌నగర్‌లోని ఎంఎంఎస్ సంస్థ కార్యాలయంలో మిలియన్స్ నెట్‌వర్క్ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతరం వ్యాపార రంగంలో రాణించేందుకు వృత్తి శిక్షణ, మార్కెటింగ్ నైపుణ్యం అవసరమన్నారు.పాజిటివ్ థింకింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్,నాయకత్వ లక్షణాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రతినిధులు పి.శ్రీకాంత్,ఇమ్మడి రమేష్, శ్రీనివాస్,రవి,కీర్తి,రాజేశ్వరి, సంతోష్, రంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


**BEFORE THE HON'BLE TELANGANA STATE CONSUMER DISPUTES REDRESSAL COMMISSION: AT HYDERABAD**

F.A No. 617 of 2022

**BETWEEN:**

Dr. Mallemarapu Satya Narayana - Appellant / Complainant

And

M/s. S.R.B. Housing Developers Pvt. Ltd. & Anor. ..Respondents/ Opp. Parties

To

M/s. S.R.B.Housing Developers Pvt. Ltd., Rep. by its Managing Director, Sri S.Ramesh Babu, Flat No.501, Lumbini Rockdale Compound, Somajiguda, Hyderabad-500 082. ...(Respondent No.1)

Take notice that FA No.617/2022 on the file of the Hon'ble Telangana State Consumer Disputes Redressal Commission,Hyderabad stands for your appearance on **31.10.2023.** You are requested to enter appearance either in person or through an advocate at 10:30 AM on 31.10.2023 before Hon'ble Telangana State Consumer Disputes Redressal Commission, Eruvaka Bhavan, Khairatabad, Hyderabad, failing which take notice that the Hon'ble Commission may dispose of the Appeal without any further notice to you.

(BY THE ORDERS OF THE HON'BLE STATE COMMISSION)

counsel for Appellant

Sd/- **V. Gouri Shankara Rao,** Advocate, Villa No.4, Panchavati, H.No. 8-2-293/15-13/4, Rd.No.14, Banjarahills, Hyd-34.


# ఎన్నికల నిబంధనలు తప్పకుండా పాటించాలి

అంబర్‌పేట, అక్టోబర్ 16 : అంబర్‌పేట నియోజకవర్గంలో అన్ని పార్టీలు తూచా తప్పకుండా ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎన్నికల అధికారి(ఆర్వో) బి.అపర్ణ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అంబర్‌పేట తాసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని విడుదల చేయడంతో పాటు ప్రతి ఒక్కరూ విధిగా నియమ నిబంధనలను పాటించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అధికారులు, రూట్, సెక్టోరియల్ అధికారులను నియమించారు.

**ఎన్నికల సహాయ కేంద్రం ఏర్పాటు**

ఎన్నికల కంట్రోల్ రూమ్, ఫిర్యాదులు స్వీకరించేందుకు ఆర్వో కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. సమాచారం కోసం 1950లో సంప్రదించవచ్చని తెలిపారు.

**సువిధా కేంద్రం**

సింగిల్ విండో క్లియరెన్స్ కోసం రిటర్నింగ్ కార్యాలయంలో సువిధ కేంద్రం ఏర్పాటు చేశారు. రాజకీయ పార్టీల సమావేశాలు, ర్యాలీలు, ఇతర కార్యక్రమాల అనుమతులను సువిధా కేంద్రం ద్వారా క్లియర్ చేయనున్నారు. దరఖాస్తులు చేసుకున్న 24 గంటల్లోనే క్లియర్ చేయనున్నారు.

**సర్వేలైన్స్ టీంలు..**

అంబర్‌పేట నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణ కోసం సర్వేలైన్స్ టీంలను ఏర్పాటు చేసినట్లు ఆర్వో బి.అపర్ణ తెలిపారు. అలాగే నియోజకవర్గంలో ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు ఏర్పాటు చేశామని అన్నారు. ఈ టీంలో ఒక ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్, ఒక సీనియర్ పోలీస్ అధికారి, ఒక ఆర్మ్‌డ్ పోలీసు, ఒక వీడియో గ్రాఫర్ ఉంటారు. నియోజకవర్గం వ్యాప్తంగా సంచరిస్తూ రాజకీయ పార్టీల కదలికలను, ఎన్నికల నిబంధనలు పాటించని వారిపై కొరడా ఝుళిపించేందుకు విధులు నిర్వహిస్తారు. అదే విధంగా వీడియో సర్వేలైన్స్ టీంలు కూడా పని చేస్తాయని పేర్కొన్నారు. మరో వీడియో వీవింగ్ టీం కూడా అందుబాటులో ఉండి మేజర్ పొలిటికల్ ర్యాలీ లు, మీటింగ్‌లపై నిఘా పెడతారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను అతిక్రమించినా, ప్రభుత్వ భవనాలు, గెస్ట్‌హౌజ్‌లు, వాహనాలు వాడినా చర్యలు తీసుకుంటారు.

# కొనసాగుతున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



ఫిలింనగర్‌లోని మాగంటి కాలనీలో కనకదుర్గాదేవి అవతారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

బంజారాహిల్స్,అక్టోబర్ 16: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజైన సోమవారం ఖైరతాబాద్ నియోజకవర్గంలోని అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.

- శ్రీనగర్ కాలనీలోని శ్రీ భ్రమరాంబ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని శ్రీ గాయత్రీ దేవి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- ఫిలింనగర్‌లోని మాగంటి కాలనీ శ్రీ విజయదుర్గా కాలనీలో అమ్మవారు శ్రీ కనకదుర్గ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.
- ఫిలింనగర్ దైవసన్నిధానం, శ్రీ రాజరాజేశ్వరి ఆలయం, బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని కనకదుర్గ ఆలయాల్లో విశేష పూజలు, హోమాలు నిర్వహించారు.



శ్రీనగర్ కాలనీలో శ్రీ గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీ భ్రమరాంబదేవి



కనకదుర్గ మండపంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



## ప్రపంచ ఆహార దినోత్సవంపై అవగాహన

ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా సోమవారం బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1లోని విరించి ఆస్పత్రిలో ఆహారంలో నీటి ప్రాధాన్యత, కలుషిత నీటివల్ల వచ్చే జబ్బులు, ప్రాణికోటికి జీవనాధారమైన నీటిని రక్షించుకోవాల్సిన అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నగరంలోని పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేకంగా రూపొందించిన పోస్టర్ల ద్వారా ఆహార దినోత్సవ థీమ్ అయిన 'నీరే జీవితం- నీరే ఆహారం' అనే అంశాన్ని గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ ఎన్‌విజన్ కౌన్సిల్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఫౌండర్ డైరెక్టర్ ప్రవీణనాయుడు, డా.మోహన్, ప్రొ.విద్యాసాగర్, డా. సాయి రవిశంకర్ పాల్గొన్నారు.-బంజారాహిల్స్

## తొమ్మిదిమంది పాత నేరస్తులు బైండోవర్

హిమాయత్‌నగర్,అక్టోబర్16: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ముందస్తుగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అనుమానితులు,పాత నేరస్తులను అదుపులోకి తీసుకుని సోమవారం ఆర్డీవోఎదుట బైండోవర్ చేసినట్లు నారాయణగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్ తెలిపారు.